సామూహిక కార్తీక దీపారాధన


సామూహిక దీపారాధన పూజల్లో రాహుల్‌దాస్‌బాబా


భక్తుల నుంచి దీప దానం స్వీకరిస్తున్న బాబా

లంగర్‌హౌస్: కార్తీక మాస సామూహిక దీపారాధన పూజలు వైభవోపేతంగా జరిగాయి. లంగర్ హౌస్ త్రివేణి సంగంలో దుప్కి పున్నమి జాతరను పురస్కరించుకొని పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పంతులు శ్రీనివాసరమణ చేతుల మీదుగా సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సామూహిక దీపారాధన పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆనవాయితీ ప్రకారం భక్తులు ఆ దీపాలను రాహుల్‌దాస్ బాబాకు దానంగా సమర్పించారు.

మేయర్ కార్తీక మాసం పూజలు

అబిడ్స్: కార్తీకమాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా కార్తీకమాసం ప్రత్యేక పూజలు చేశారు. కీసరగుట్టలో జరిగిన కార్తీక మాసం వేడుకల్లో దీపాలంకరణ చేపట్టారు.


పూజలు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, మమతా గుప్తా

కమ్యూనిటీహాళ్లను పరిరక్షించండి


డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంతోష్ గుప్తా

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కమ్యూనిటీహాళ్లను పరిరక్షించాలని నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్‌గుప్తా కోరారు. కమ్యూనిటీహాళ్లు కొంత మంది సొంత ప్రయోజనాలకు వాడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం అబిడ్స్ జీహెచ్‌ఎంసీ–14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం సంతోష్‌గుప్తా మాట్లాడుతూ గన్‌ఫౌండ్రీతోపాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల కమ్యూనిటీ హాళ్లను కొంత మంది దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అన్ని కమ్యూనిటీహాళ్ల పరిరక్షణ, పర్యవేక్షణ చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. తాను త్వరలోనే జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మీని కలిసి ఆమెకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.


జోరుగా సమగ్ర సర్వే

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సమగ్ర కుటుంబ సర్వే జోరుగా కొనసాగుతోంది. ఆగాపురా, గోషామహల్, హిందీనగర్, అబిడ్స్, మహేష్‌నగర్, నేతాజీనగర్ ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ నేతృత్వంలో సర్వే కొనసాగించారు. పలు ఇళ్ల వద్దకు జీహెచ్‌ఎంసీ అధికారులు, ఎన్యుమరేటర్లు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సర్వే చేపడుతున్నారు. సర్వే వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వార్డు ఇన్‌చార్జి సతీష్‌కుమార్, సూపర్‌వైజర్ కైలాష్ సింగ్, ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించారు.


ఆగాపురాలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

21 నుంచి ఉర్సు షరీఫ్ వేడుకలు

జియాగూడ: జియాగూడలోని చరిత్రాత్మక కమరేకి గుమ్మద్‌లో ఈ నెల 21 నుండి మూడు రోజుల పాటు దర్గాహ్ హజరత్ సయ్యద్ షా మీరన్ ఖుదానుమై హుస్సేని చిస్తీ – ఉల్ ఖాద్రీ (ఆర్‌హెచ్) వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు సయ్యద్ చందా హుస్సేని ఖుదానుమై జానషీన్ ఈ మీరన్ ఖుదానుమై హుస్సేని (ఆర్.హెచ్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పురానాపూల్ నుండి జియాగూడ కమరేకి గుమ్మద్ వరకు సందల్ ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు. శుక్ర, శనివారం రోజున చిరాగన్ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు, స్థానికులు పెద్దఎత్తున పాల్గొంటారని, మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు నిర్వహిస్తామన్నారు.


వేడుకలకు సిద్ధమైన కమరేకి గుమ్మద్

టీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో రోడ్డుపై నడుస్తున్న వయోధికులు



కనిపించని కాలిబాటలు

నాంపల్లి: ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో పాదచారులు రోడ్డు మీదే నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల శాంతినగర్‌లో విశ్రాంతి రైల్వే ఉద్యోగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఓ బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నెల రోజులపాటు ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వచ్చింది. మహవీర్ ఆసుపత్రి ఎదురుగా ఉండే జేఎన్‌ఏఫ్‌ఏయూ కళాశాల, ఉన్నత విద్యామండలి కార్యాలయాలకు ఎదురుగా ఫుట్‌పాత్‌లు కూడా కనిపించకుండా పోయాయి. టీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం, సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. నాంపల్లి రైల్వేస్టేషన్ చుట్టూ ఎటు చూసినా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలే. ఈ మార్గంలో నిత్యం వీవీఐపీ, వీఐపీల రాకపోకలు ఉండటం గమనార్హం. టౌన్‌ప్లానింగ్ అధికారులు సకాలంలో స్పందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించకపోవడంతో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నట్లు పోలీసులు వాపోతున్నారు. ఫుట్‌పాత్‌లను తొలగించాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు మంగళవారం నగరంలోని రెండు చోట్ల దాడులు నిర్వహించి 3 కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నారు. దూల్‌పేట్ జుమ్మెరాత్ బజార్‌లోని ముఖేష్ సింగ్ ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 2.27 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు సాగిస్తున్న సతీష్ దినేష్ సింగ్, అరుణ్ బాయిలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి గంజాయితోపాటు సెల్‌ఫోన్, యాక్టివా వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని ముఖేష్ సింగ్‌పై కూడ కేసు నమోదు చేశారు. బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు డెనియల్ నగర్‌లో నకిరేకల్‌కు చెందిన రజనీకాంత్ వద్ద 1.05 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ వినాయక నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణం పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు కమిటీ సభ్యుడు ఆడాల అశోక్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయకనగర్‌లో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా, పొరుగిళ్లకు ప్రమాదం జరిగేలా ఇష్టానుసారంగా పిల్లర్ గోతులు తవ్వి నిర్మాణ పనులు చేపడుతున్నారని అశోక్ కుమార్ ఆరోపించారు.

22న కురుక్షేత్ర అనుస్మరణ పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 22వ తేదీన రవీంద్రభారతిలో కురుక్షేత్ర అనుస్మరణ పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు రచయిత అరుణ్ కొత్త మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వాసవి మహిళా సమైక్య ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మీ, బొగ్గారపు దయానంద్‌లతోపాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా వరల్డ్ హెరిటేజ్ వీక్ ప్రారంభం

గోల్కొండ: ప్రపంచ ప్రసిద్ధ కట్టడాలకు హైదరాబాద్ నగరం పెట్టింది పేరని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం గోల్కొండ కోటలో కేంద్ర పురావస్తు పర్యవేక్షక శాఖ ఆధ్వర్యంలో వరల్డ్ హెరిటేజ్ వీక్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సయ్యద్ ఫయాజ్ అక్కడ ఏర్పాటు చేసిన చిత్రమాలికను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అద్భుతమైన కట్టడాలు ఎన్నో మన నగరంలో ఉన్నాయని, గోల్కొండ కోటతోపాటు చార్మినార్ దీనికి నిదర్శనమన్నారు. వారసత్వ కట్టడాలను, ప్రాచీన శిల్పాలను పరిరక్షించడంలో కేంద్ర పురావస్తు పరిరక్షణ శాఖ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేంద్ర పురావస్తు పరిరక్షణ శాఖ డిప్యూటీ ఆర్కియాలజిస్టు డాక్టర్ హెచ్‌ఆర్ దేశాయి, గోల్కొండ కోట ఇన్‌చార్జి నవీన్, సాయిక్రిష్ణ తదితరులు ఉన్నారు.


గోల్కొండ కోటలో వరల్డ్ హెరిటేజ్ ప్రారంభ కార్యక్రమంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘనంగా నివాళులు


ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చార్మినార్: సిటీ కాలేజీలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాలేజీ ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రొఫెసర్ ఏలూరి యాదయ్య మాట్లాడుతూ ఒక చంకలో శిశువును, మరో చేతిలో ఖడ్గాన్ని ధరించి దేశం కోసం పోరాడిన ఝాన్సీ లక్ష్మీ బాయి గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలని కొనియాడారు. కార్యక్రమంలో ఏవో మాధవి, ప్రొఫెసర్ శంకర్, రామ్‌కుమార్‌లతోపాటు కాలేజీ అధ్యక్షుడు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుంకుమార్చన

చార్మినార్: పాతబస్తీ మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కన్నుల పండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ పూజల్లో దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పాల్గొన్నారు. మీరాలంమండి అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించి భక్తుల సందర్శనార్థం ఉంచారు. పూజల అనంతరం దేవాలయం కమిటీ తరఫున భక్తులకు పులిహోర, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంజయ్య తెలిపారు.


పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య

గుడిమల్కాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ భోజగుట్టలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ మాట్లాడుతూ తెలంగాణలో రోజురోజుకు బీజేపీ బలీయమైన శక్తిగా ఎదిగి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనిల్, ప్రభు పూజారి, అశ్విన్‌మోదీ తదితరులు ఉన్నారు.


బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు యాదవ్ తదితరులు

కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాంబాబు

సుల్తాన్‌బజార్: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను త్వరగా రెన్యువల్ చేయాలని, ప్రభుత్వం నేరుగాగానీ, ప్రభుత్వ కార్పొరేషన్ ద్వారాగానీ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు స్లాబ్ విధానం రద్దు చే కేడర్ బేసిక్ పే ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జీతంపై పది శాతం ఇంక్రిమెంట్ (ఐసీటీసీ, పోలీస్ హోంగార్డుల మాదిరి) ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షపతి, రాష్ట్ర కోశాధికారి బి.సుభాష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీయుద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ శాంతికుమార్ గౌడ్ పాల్గొన్నారు.


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్


ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మణిలాల్ షా

ఇందిరాగాంధీకి ఘన నివాళి

చాంద్రాయణగుట్ట: దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జంగమ్మెట్‌లోని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆమె చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రమోద్ రెడ్డి, కె.గణేష్ రాథోడ్, సి.అశోక్ ముదిరాజ్, ఎం.మోహన్ రెడ్డి, అనిల్‌కుమార్ తుడి, డి.ద్వారక్ గౌడ్, భాను ప్రకాష్, శివకుమార్, సి.నర్సింగ్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

నివాళులర్పించిన శ్యాంరావు ముదిరాజ్

గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెక్కల నర్సింగ్ రావు, రాజు, విజయ్, వెంకట్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రీ: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీభవన్, జాంబాగ్, బేగంబజార్ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

లంగర్‌హౌస్: కార్వాన్ ఏ బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు క్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న క్రిష్ణ తదితరులు


జంగమ్మెట్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రమోద్‌రెడ్డి, గణేష్ రాథోడ్


ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్యాంరావు ముదిరాజ్

నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా చార్మినార్ సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. చందూలాల్ బారాదరి, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మోచీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఐటీఐ కాలనీ, మోచీ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఫలక్‌నుమా ఏడీఈ పరిధిలో...

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. మైసారం, ఫలక్‌నుమా ఓహెచ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, యూసుఫైన్ కాలనీ, ఫలక్‌నుమా ఓజీసీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, సలాల, పీలిదర్గా, ఇందిరానగర్, వట్టేపల్లి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యానికి ప్రయాణికుడి బలి

లంగర్‌హౌస్: ఆటో డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ ప్రయాణికుడు బలి అయ్యాడు. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... టోలిచౌకి హకీంపేట్‌లో నివాసముండే మొహమ్మద్ చోటుమియ్యా(55) వృత్తిరీత్యా సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ నెల 12 తేదీన పనులు ముగించుకొని రాత్రి ఏడు గంటలకు ఇంటికి వెళ్లడానికి మెహిదీపట్నంలో ఆటో ఎక్కాడు. ఆటోలో అప్పటికే ప్రయాణికులు నిండటంతో డ్రైవర్ తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు. డ్రైవర్ వేగంగా ఆటోను అటుఇటు తిప్పుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేశాడు. దీంతో టోలిచౌకి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభంలో చోటుమియ్యా ఆటోలో నుంచి జారి కింద పడ్డాడు. గాయాలపాలైన అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. అయితే ప్రమాద సమయంలో వివరాలు సేకరించిన ఫిల్మ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసును లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు. మృతదేహానికి ఉస్మానియా మర్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి


నారాయణ స్పోర్ట్స్ మీట్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

చార్మినార్: రోజువారీ విద్యాభ్యాసంతోపాటు విద్యార్థులందరూ క్రమం తప్పకుండా క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. నారాయణ పాఠశాలల స్పోర్ట్స్ మీట్ అంబర్‌పేట్ ఎంసీహెచ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగింది. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెగ్యులర్ వ్యాయామం అవసరమన్నారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్ రావు, నారాయణగూడా జోన్ ప్రిన్సిపాల్స్, కో–ఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థినీవిద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని జీఎం గోపాల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

యాకుత్‌పురా: మదీనానగర్‌లో చేపట్టిన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులకు తలెత్తకుండా రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళల ఉత్సవం ప్రారంభం

జానపద కళలను రక్షించుకోవాలి: రమణాచారి


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సంప్రదాయ కళల ఉత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులనే మరిచిపోతున్న కాలంలో జాతి గుర్తింపునకు మాతృ కళలైన జానపద కళల గురించి పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు పద్మశ్రీ పురస్కార గ్రహీత కనకరాజు శిష్యుడు సుదర్శన్ బృందం ప్రదర్శించిన గుస్సాడి నృత్యం, పలు జానపద సంగీత కళా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్.ప్రభాకర్‌రావు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే జీవితాల్లో మార్పు

అఫ్జల్‌గంజ్: సమాజంలో విద్య ద్వారానే మార్పు సాధ్యమవుతుందని చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ అన్నారు. మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతా రోహిణి, చిల్డ్రన్స్ స్టోరీ టెల్లర్ కన్నె డైరెక్టర్ అనసూయ, చిల్డ్రన్ ఫైన్‌ఆర్ట్స్ గ్యాలరీ డైరెక్టర్ అతిక్ అహ్మద్, జవహర్ బాలభవన్ ఆర్ట్ డైరెక్టర్ కప్పరి కిషన్, స్టోరీ టెల్లర్ పద్మ, హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ డీన్ రామాంజనేయులు, బాలచెలిమి పత్రిక సమన్వయ కర్త ఖైజర్ భాష, అధికారులు పీజీవి రాణి, సి.అపర్ణ, కేసరి హనుమాన్, రాకేష్, రవి పాల్గొన్నారు.